సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం 7
ఆదివారం। 15। జనవరి। 2023

రామయ్య సన్నిధిలో గోదా - రంగనాథుల కల్యాణం

భద్రాచల శ్రీ సీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో భోగి పండుగను పురస్కరించుకొని గోదా - రంగనాథ స్వామి కల్యాణ మహోత్సవాన్ని శనివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ వేడుకకు భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. 10లో




సంక్రాంతి సందడి..




పాల్వంచలోని ఆత్మలింగేశ్వరాలయంలో భోగిమంటలు వేస్తున్న భక్తులు (ఇన్‌సెట్) కరకగూడెంలో..

జిల్లాలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. శనివారం భోగి వేడుకలు నిర్వహించగా, ఆదివారం సంక్రాంతి పండుగకు సన్నద్ధమవుతున్నారు. లోగిళ్లలో రంగవల్లులు వేయడంతో పాటు ఇళ్లను సుందరంగా అలంకరించారు. 9లో







అందరి చూపూ.. తెలంగాణ వైపే



సభలో మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన మంత్రి అజయ్‌కుమార్, మాజీ మంత్రి తుమ్మల తదితరులు

- జిల్లాలో మతతత్వ బీజేపీకి డిపాజిట్ దక్కదు
- ఎవరైనా ఆ పార్టీ వైపు ఆలోచిస్తే గోతిలో పడ్డట్టే
- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు

ఇల్లెందు: యావత్ దేశం తెలంగాణ వైపే చూస్తోందని, అన్ని రంగాల్లో రాష్ట్రం నంబర్ 1 స్థానంలో ఉందని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. మండలంలోని బొజ్జాయిగూడెంలో శనివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజనకు ముందు పలువురు నాయకులు ఎన్నో రకాలుగా మాట్లాడారని, ఇప్పుడు వారే రాష్ట్రాభివృద్ధిని చూసి ఆశ్చర్యపోతున్నారని చెప్పారు. ఏ రంగంలో చూసినా తెలంగాణ అగ్రభాగంలో ఉందన్నారు. ఉత్తమ పంచాయతీలు, మండలాలు, మున్సిపాల్టీల ఎంపికలో పదికి పది కైవసం చేసుకున్న చరిత్ర మనదేనన్నారు. ఈనెల 18న ఖమ్మంలో జరిగే సభ ప్రతిష్టాత్మకమైనదని, సభకు ఇతర రాష్ట్రాల సీఎంలు, ఆయా పార్టీల జాతీయ నాయకులు వస్తున్నందున విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

నాయకులు ప్రజల మధ్యే ఉండాలి..

సభకు ప్రజలను లారీల్లో పంపి కార్లలో వచ్చే వారు నాయకులు కారని, ప్రజల వెంట అదే లారీలో వచ్చేవారే అసలైన నాయకులని హరీశ్‌రావు అన్నారు. అందుకే నేతలెవరూ కార్లలో కాకుండా ప్రజలతోనే కలిసి రావాలని సూచించారు. గతంలో తాను సంగారెడ్డి సభకు అలాగే వెళ్లానని గుర్తు చేశారు. బొగ్గుబావులు గల చరిత్ర ఇల్లెందుకు ఉందని, బొగ్గు బావులను తెగనమ్మిన చరిత్ర బీజేపీదని ఎద్దేవా చేశారు. ఎల్‌ఐసీని, రైల్వేను, స్టేషన్లనూ అమ్ముతున్నారని విమర్శించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మతతత్వ బీజేపీకి డిపాజిట్ దక్కదని, ఎవరైనా ఆపార్టీ వైపు ఆలోచిస్తే తాము తవ్వుకున్న గోతిలో తామే పడ్డట్టు అని అన్నారు. మోదీ అధికారంలోకి రాక ముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని ప్రకటించాడని, ఈ ఎనిమిదేళ్లలో 16 కోట్ల ఉద్యోగాలు ఇచ్చాడా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ తెలంగాణలో ఇప్పటి వరకు 90 వేల ఉద్యోగాలు ఇచ్చారని, వైద్యారోగ్య శాఖలో 926 డాక్టర్ పోస్టులు భర్తీ చేశామని, 5 వేల స్టాఫ్ నర్సు పోస్టులను భర్తీ చేయబోతున్నామని తెలిపారు. రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ తల్లి లాంటి పార్టీకి ద్రోహం చేయొద్దనే ఇంగిత జ్ఞానం ఉండాలని, ఉద్యమంలో లేకపోయినా పదవులు వచ్చాయని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పదికి పది అసెంబ్లీ స్థానాలు గెలిచి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్‌కు అందరూ అండగా నిలవాలని కోరారు. మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశ గతిని మలుపు తిప్పే చాన్స్ ఖమ్మం నుంచే ప్రారంభం కాబోతోందని అన్నారు. ఖమ్మం సభలో సీఎం కేసీఆర్ ఏం చెప్పబోతున్నారోనని అందరూ ఆసక్తిగా చూస్తున్నారని అన్నారు. సభలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, ఇల్లెందు, సత్తుపల్లి ఎమ్మెల్యేలు బానోత్ హరిప్రియ, సండ్ర వెంకటవీరయ్య, టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఎమ్మెల్సీ తాతా మధు, జిల్లా గ్రంథాల య సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, మహబూ బాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బిందు, డీసీఎంఎస్ చైర్మన్ శేషగిరిరావు, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, విప్ సంక్రాంతి శుభాకాంక్షలు




కలెక్టర్ అనుదీప్



విప్ రేగా

సూపర్‌బజార్(కొత్తగూడెం)/మణుగూరురూరల్: జిల్లా ప్రజలకు కలెక్టర్ అనుదీప్, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు వారు శనివారం వేర్వేరుగా ప్రకటనలు చేశారు. ప్రజలంతా ఆయురారోగ్యాలు, ఆనందోత్సాహాలతో గడపాలని, పాడి పంటలు, సకల సౌభాగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.





క్లుప్తంగా

కొల్లాపురంలో వాలీబాల్ పోటీలు షురూ..



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కొల్లాపురం గ్రామంలో యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 46వ ఐదు జిల్లాల స్థాయి వాలీబాల్ పోటీలను శనివారం గ్రామపెద్దలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఏటా సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పండుగకు గ్రామంలోని ప్రతి కుటుంబం ఇంటికి చేరుకొని పోటీలను ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని గుర్తుచేశారు. అనంతరం పోటీలు ఉత్సాహభరితంగా ప్రారంభమయ్యాయి. గ్రామంలో ముగ్గుల పోటీలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు చీమల రామ్మూర్తి, చీమల లక్ష్మయ్య, మండల వెంకన్న, ఆదినారాయణ, చీమల బాబు, మోకాళ్ల రమేష్, మల్లేష్, సోసఫ్, దోసూరి రమేష్, ఎర్ర భద్రం, చలపతిరావు, వెంకట్, సాయి తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్‌లో తండ్రీకుమారుల సత్తా



మైఖేల్, రవికిరణ్

బోనకల్: మండలంలోని బ్రాహ్మణపల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాసరి రవికిరణ్, ఆయన కుమారుడు మైఖేల్ ఇమ్మానియల్ గ్రూప్-1 ప్రిలిమ్స్ క్వాలిఫై అయ్యారు. కుమారుడిని గ్రూప్ – 1 ఆఫీసర్‌గా చూడాలన్న ఆశయంతో తండ్రి రవికిరణ్ తాను చదువుతూ కుమారుడిని పరీక్షకు సిద్ధం చేయించారు. ఈమేరకు ఇద్దరూ ప్రిలిమ్స్‌లో సత్తా చాటారు.

భోగి రోజు తీరని విషాదం

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

అశ్వారావుపేటరూరల్: సంక్రాంతి పండుగ వేళ ఓ ఇంట్లో తీరని విషాదం నెలకొంది. పండుగతో సంతోషంగా ఉండాల్సిన వారంతా కన్నీమున్నీరుగా విలపిస్తున్నారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని దండాబత్తుల బజార్‌కు చెందిన జూజం బంగారయ్య(53) శనివారం ఉదయం ఖమ్మం రోడ్‌లో ఉన్న తన సర్వీసింగ్ సెంటర్‌కు వెళ్లాడు. వాహనాలను సర్వీసింగ్ చేసేందుకు విద్యుత్ మోటారు స్విచ్ ఆన్ చేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుని భార్య జానకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,881

‘కంటి వెలుగు’తో అంధత్వ నివారణ

టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): అంధత్వాన్ని నివారించడమే కంటి వెలుగు కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ అనుదీప్ పేర్కొన్నారు. కార్యక్రమం నిర్వహణపై శనివారం తన క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఫిర్యాదులు చేయడానికి కలెక్టర్ కార్యాలయంలో 08744-241950 టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమ నిర్వహణ ఆహ్వాన పత్రిక ప్రతీ ఇంటికి చేరాలని సూచించారు. ఆర్థిక ఇబ్బందులతో సరైన సమయంలో చికిత్స లేకపోవడం, పగిలిన కంటి అద్దాలనే వాడటం తదితర కారణాల వల్ల చూపు మందగిస్తుందని చెప్పారు. పరీక్షల అనంతరం గుర్తించిన సమస్య ప్రకారం కంటి అద్దాలను ఉచితంగా అందజేస్తామని చెప్పారు. అంధత్వరహిత జిల్లాగా తయారు కావాలంటే ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని పేర్కొన్నారు. ఈనెల 18న మధ్యాహ్నం ఒంటి గంటకు జిల్లాలోని 48 కేంద్రాల్లో ఏకకాలంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. కంటి వెలుగు కోసం గ్రామీణ ప్రాంతాల్లో 36, పట్టణ ప్రాంతాల్లో 12 టీంలు ఏర్పాటు చేశామని చెప్పారు. సోమవారం నుంచి శుక్రవారం వరకు ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. జిల్లాలో 18 సంవత్సరాల కంటే వయసు పైబడినవారు 7.90 లక్షల మంది ఉన్నారని వివరించారు. కంటి పరీక్షకు వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డును తెచ్చుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, జిల్లా వైద్యాధికారిణి డాక్టర్ శిరీష, అన్ని శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో బోటు షికారు



రిజర్వాయర్‌లో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: భోగి పండగ సందర్భంగా కిన్నెరసాని పర్యాటక ప్రాంతంలో సందడి నెలకొంది. అధిక సంఖ్యలో సందర్శకులు శనివారం కిన్నెరసాని ప్రాజెక్టుకు తరలివచ్చారు. డీర్ పార్కులోని దుప్పులను, డ్యామ్‌పై నుంచి జలాశయాన్ని వీక్షించి సరదాగా గడిపారు. 972 మంది పర్యాటకులు తరలిరాగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.33,135 ఆదాయం, 650 మంది బోటు షికారు చేయడం ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.32,270 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

అసోసియేట్ అధ్యక్షుడిగా విజయ్



విజయ్

కొత్తగూడెంరూరల్: తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మహబూబాబాద్‌లో విద్యుత్ శాఖ డీఈగా విధులు నిర్వర్తిస్తున్న విజయ్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్యామ్ మనోహర్, జనరల్ సెక్రటరీ ఎం.రమేష్, ఎన్పీడీసీఎల్ విభాగం అధ్యక్షుడు ఎ.ఆనందమ్ సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. ఆయన్ను శనివారం పలువురు అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా విజయ్ తెలిపారు.

పెద్దమ్మతల్లికి భోగిపండ్లతో అభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: భోగి పర్వదినం సందర్భంగా శనివారం పెద్దమ్మతల్లికి భోగి పండ్లతో అభిషేకం జరిపారు. మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) అమ్మవారికి అర్చకులు రేగు పండ్లతో పూజలు జరిపారు. అనంతరం పండ్లను భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పద్మనాభ శర్మ, రవికుమార్‌శర్మ, ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

రేపు నూతన కలెక్టరేట్‌లో ప్రజావాణి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నూతన కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ) అశోక చక్రవర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు నూతన కలెక్టరేట్‌లో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. జిల్లా కార్యాలయాలు నూతన కలెక్టరేట్‌కు మారినందున పాత కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉండరని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు. ఉదయం 10:30 గంటలకు ప్రారంభమయ్యే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.







న్యాయవ్యవస్థ హక్కులను కాలరాయొద్దు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): న్యాయవ్యవస్థ హక్కులను కాలరాసే చర్యలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని శేషగిరిభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం ప్రజాస్వామ్య పద్ధతిలోనే నడవాలని అన్నారు. రాజ్యాంగ వ్యతిరేక నిర్ణయాలు తీసుకున్నప్పటికీ న్యాయవ్యవస్థ జోక్యం చేసుకోరాదని ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ వ్యాఖ్యానించడం దేశంలో అధ్యక్ష తరహా పాలనకు సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసి పదవీ బాధ్యతలు చేపట్టిన జగదీప్ అదే రాజ్యాంగాన్ని ధిక్కరిస్తూ వ్యాఖ్యలు చేయడం తగదని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన వ్యక్తే రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని విచ్ఛిన్నం చేసే చర్యలకు పూనుకోవటం దారుణమని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా రాజ్యాంగ వ్యవస్థ విధ్వంసానికి పాల్పడుతోందని ఆరోపించారు. లెజిస్లేచర్, ఎగ్జిక్యూటివ్ వ్యవస్థల్లో ఎలాంటి తప్పులు జరిగినా అంతిమంగా న్యాయవ్యవస్థే ఎత్తిచూపి సరిదిద్దాల్సి ఉంటుందని అన్నారు. ప్రజలు బీజేపీ వ్యతిరేక శక్తుల వైపు ఆకర్షితులవుతున్నారని, అదే విషయాన్ని ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయని గుర్తుచేశారు. దేశంలో బీజేపీని నిలువరించే శక్తి కేవలం కమ్యూనిస్టులకే ఉందని, మతోన్మాద బీజేపీని నిలువరించేందుకు బీఆర్‌ఎస్, డీఎంకే, ఆర్జేడీ, ఆమ్ ఆద్మీ వంటి పార్టీలతో కలిసి కమ్యూనిస్టులు పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. తెలంగాణలో పాగా వేసేందుకు బీజేపీ చేస్తున్న కుయుక్తులను, కుట్రలను తిప్పి కొడతామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉభయ కమ్యూనిస్టులదే నిర్ణయాత్మక పాత్ర అని, గెలుపోటములను ప్రభావితం చేసే శక్తి కమ్యూనిస్టులకు ఉందని పేర్కొన్నారు. ఈ నెల 18న ఖమ్మంలో జరిగే బీఆర్‌ఎస్ సభకు కమ్యూనిస్టు పార్టీలను ఆహ్వానించారని, బీజేపీకి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ బలమైన గొంతు వినిపిస్తున్న క్రమంలో కమ్యూనిస్టుల పార్టీ జాతీయ నాయకత్వం సభకు హాజరవుతుందని తెలిపారు. అదే సందర్భంలో దళితబంధు పథకం అమలు కలెక్టర్లకు అప్పగించడం, పోడు సమస్య పరిష్కారం, ఆర్టీసీ, స్కీమ్ వర్కర్ల సమస్య, నిరుద్యోగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంతోనూ పోరాటం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబిర్‌పాషా, జిల్లా నాయకులు బందెల నర్సయ్య, వై.శ్రీనివాస్‌రెడ్డి, కందుల భాస్కర్, కంచర్ల జమలయ్య, వంగా వెంకట్, జీ.వీరస్వామి, మునిగడప వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎల్సిరెడ్డిపల్లి హెచ్‌ఎం, వార్డెన్ సస్పెన్షన్

పినపాక: మండల పరిధిలోని ఎల్సిరెడ్డిపల్లి పాఠశాల హెచ్‌ఎం డి.రమాదేవి, వార్డెన్ భవానిలను సస్పెండ్ చేస్తూ ఐటీడీఏ పీఓ గౌతమ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పాఠశాల పనివేళల్లో ఉపాధ్యాయులు స్థానిక పేరంటాల చెరువు సమీపంలో విందు చేసుకున్నారు. ఈ ఘటనపై ఏటీడీఓ పూనెం నరసింహారావు విచారణ చేపట్టి నివేదిక అందించారు. నివేదిక ఆధారంగా ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ పీఓ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

దమ్మపేట: మండల పరిధిలోని ముష్టిబండ గ్రామ శివారు పామాయిల్ క్షేత్రంలో పేకాట ఆడుతున్నవారిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... విశ్వసనీయ సమాచారంతో పోలీసులు పామాయిల్ క్షేత్రంలోని పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.5,800 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

గుర్రాయిగూడెంలో మరో ఐదుగురు..

చండ్రుగొండ : మండల పరిధిలోని గుర్రాయిగూడెం శివారు శనివారం పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గొల్లపల్లి విజయలక్ష్మి తెలిపారు. రూ. 3,100 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రోహిత్ రాజ్

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణానికి చెందిన ఓ బాలుడు కిడ్నాప్ వ్యవహారం సుఖాంతమైంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను భద్రాచలం ఏఎస్పీ రోహిత్ రాజ్ శనివారం వెల్లడించారు. ఏఎస్పీ కథనం ప్రకారం.. ఈ నెల 6న పట్టణంలోని అశోక్‌నగర్ కాలనీకి చెందిన ఓ బాలుడు అదృశ్యమైనట్లు కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కేసు ఛేదించారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే అత్యాశతో అదే కాలనీకి చెందిన కందుల అన్నపూర్ణ, ఆమె రెండో కూతురు అనూష, కుమారుడు సాయిరాం కలిసి బాలుడిని కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకున్నారు. స్థానికంగా ప్రైమరీ పాఠశాలలో చదువుతున్న బాలుడిని మచ్చిక చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఏపీలోని రాజమండ్రికి చెందిన బెండ తులసి అనే మహిళా ద్వారా పిల్లలు లేని డాక్టర్ స్నేహలత, ఇసాక్ గుణ్ణం దంపతులకు అమ్మేందుకు బేరం కుదుర్చుకున్నారు. అందుకోసం రూ.4.50 లక్షలకు ఒప్పందం చేసుకున్నారు. కాగా గత నెల 27న బాలుడిని రాజమండ్రి తీసుకెళ్లి ఆ దంపతులకు చూపించి అదే రోజు సాయంత్రం తీసుకొచ్చారు. మళ్లీ ఈ నెల 6న బాలుడిని తీసుకెళ్లి బాలుడిని వారికి అప్పగించారు. వారి నుంచి డబ్బులు తీసుకుని, రూ.50 వేలు మధ్యవర్తి బెండ తులసికి ఇచ్చి మిగతా నగదుతో భద్రాచలం వచ్చారు. సీసీ పుటేజీ ఆధారంగా గుర్తించి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. నిందితుల నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రూ.3.10 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బాలుడిని చైల్డ్‌లైన్, డీసీపీ యూనిట్ అధికారుల సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఆరుగురు నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని ఏఎస్పీ తెలిపారు. సీఐ నాగరాజు రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.













పేలిన ప్రెజర్‌బాంబు

సీఆర్పీఎఫ్ ఏఎస్సైకి తీవ్ర గాయాలు


చర్ల : తెలంగాణ సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు అమర్చిన ప్రెజర్‌బాంబు పేలి సీఆర్పీఎఫ్ ఏఎస్సైకి తీవ్ర గాయాలయ్యాయి. బీజాపూర్ జిల్లా తెర్రెం పోలీస్‌స్టేషన్ పరిధి పెగడపల్లి సీఆర్‌పీఎఫ్ 153 బెటాలియన్ క్యాంపునకు చెందిన జవాన్లు శనివారం ఉదయం కూంబింగ్ ఆపరేషన్ చేపట్టారు. బీజాపూర్ – సుకుమా ప్రధాన రహదారి మీదుగా వారు వెళ్తుండగా.. పోలీసు బలగాలు వస్తాయనే సమాచారంతో మావోయిస్టులు ఆ రహదారిపై ప్రెజర్‌బాంబు ఏర్పాటుచేశారు. అయితే, బలగాల్లోని సీఆర్పీఎఫ్ ఏఎస్సై మహ్మద్ అస్లాం గమనించకుండా ప్రెజర్ బాంబుపై కాలు వేయడంతో అది పేలగా తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో ఆందోళనకు గురైన సహచర జవాన్లు కొంత దూరం పరుగులు తీసి వెనక్కి వచ్చి చూడగా అస్లాంకు తీవ్రంగా గాయపడి ఉండడంతో బాసగూడకు తీసుకెళ్లి ప్రథమచికిత్స అనంతరం ప్రత్యేక హెలీకాప్టర్‌లో రాయ్‌పూర్ వైద్యశాలకు తరలించారు. కాగా, క్షతగాత్రుడు అస్లాం బిహార్ రాష్ట్రంలోని బోజ్‌పుర జిల్లా భగాయ్ వాసిగా తెలిసింది.

కుల బహిష్కరణ ఘటనపై కేసు నమోదు

ములకలపల్లి : కులపెద్దలు విధించిన జరిమానా చెల్లించలేదని, భౌతిక దాడి చేసి, తాగునీటి సరఫరా నిలిపివేసి, కుల బహిష్కరణకు పాల్పడిన ఘటనపై పోలీసులు శనివారం సమగ్ర విచారణ చేపట్టారు. మండల పరిధిలోని రాచన్నపేట గ్రామానికి చెందిన పెనుబల్లి శ్రీనివాస్ ఏడాది క్రితం మనస్పర్థలతో ఇంటి నుంచి వెళ్లిన భార్య శారదను.. తిరిగి ఇంటికి తీసుకొచ్చాడు. దీంతో గ్రామస్తులు కులపంచాయితీ నిర్వహించి, రూ. 1.5 లక్షలు జరిమానా చెల్లించాలని పేర్కొన్నారు. కాగా శ్రీను రూ.20 వేలు మాత్రమే ఇస్తానని చెప్పడంతో ఆగ్రహించిన గ్రామస్తులు, శ్రీను కుటుంబంపై దాడికి పాల్పడ్డారు. ఆ కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ చేస్తున్నట్లు టమకా వేయించారు. తాగునీటి పైపులైన్ కట్ చేశారు. విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ ఘటనపై శనివారం మీడియాలో కథనాలు రావడంతో పోలీసులు విచారణ చేపట్టారు. గ్రామాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు. సంఘటనకు కారకులైన 9 మంది స్థానికులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాల్దె సురేశ్ తెలిపారు.

అదుపు తప్పిన తుఫాన్ వాహనం

18 మంది వలస కూలీలకు గాయాలు



గాయపడ్డ మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

బూర్గంపాడు: మధ్యప్రదేశ్ నుంచి కొత్తగూడెం వస్తున్న తుఫాన్ వాహనం మండలంలోని సారపాక సమీపంలో ఉన్న పుష్కరవనం వద్ద శనివారం అదుపు తప్పి బోల్తాపడింది. తుఫాన్ వాహనం వెనుక టైరు బోల్ట్‌లు ఊడిపోవటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. వాహనంలో 20 మంది కూలీలు ఉండగా 18 మందికి గాయాలయ్యాయి. వీరిలో నలుగురు తీవ్రంగా గాయపడగా, చికిత్స నిమిత్తం 108 వాహనంలో భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా కూలీలు కొత్తగూడెం సమీప గ్రామాల్లో మిర్చి కోతలకు వస్తున్నారు.

అట్రాసిటీ కేసు నమోదు

భద్రాచలంటౌన్: కులం పేరుతో దూషించిన వ్యక్తిపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఖాదర్ అనే వ్యక్తి తనను కులం పేరుతో దూషించాడని పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన ఏ.ఆనంద్ ఫిర్యాదు చేశాడు. దీంతో ఖాదర్‌పై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు.

కోడి పందేల స్థావరంపై దాడి

దమ్మపేట: కోడి పందేల స్థావరాలపై దాడి చేసి, నిర్వాహకులను అరెస్టు చేసిన సంఘటన మండల పరిధిలోని రాచూరిపల్లి గ్రామ శివారు మల్లప్పకుంట సమీపంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... విశ్వసనీయ సమాచారంతో రాచూరిపల్లి గ్రామ శివారులోని కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. రెండు కోడి పుంజులు, రూ.3,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. 9 మంది పందెంరాయుళ్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్



ADMISSIONS

■ Admissions for Guidence B.Sc., M.Sc. అగ్రి, L.L.B., B.Tech., M.Tech., MBA, P.Hd., all Few Seats available. Cont. : 9494903629, 9247298351. [M-8484]



■ గజాల్లో కాదు ఎకరాల్లో భూమిలో పెట్టుబడి పెట్టండి. హైదరాబాద్ చేవెళ్ల దగ్గర, అర ఎకరం 70లక్షలు/1 ఎకరం 1.40 కోట్లు, క్లబ్ హౌస్ కూడకలదు. ఫోన్ : 9951297569. [HA-868]

HOUSE FOR SALE

■ ఖమ్మం, మామిళ్ళగూడెంలో 350 చ।।గ।। స్థలంలో 4 పోర్షన్లు (గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్) అన్ని సౌకర్యములు గల ఇల్లు అమ్మకానికి కలదు. సంప్ర. 76809 29744, 80082 50413 [M-1203198]

■ ఖమ్మం సిటీ నందు నరసింహస్వామి గుట్ట దగ్గర 106 గజాలు స్థలం కలిగిన నాలుగు గదుల రేకుల ఇల్లు అమ్మబడును. విలువ 35 లక్షలు. శ్రీనివాసాచార్యులు గారు. ఫోన్ : 8074559093. [HA-10013]



GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786658]



■ STATE BANK OF INDIA లైఫ్ యందు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 30 సం।।ల పైబడిన మహిళలకు నారిశక్తి Project స్కీం ద్వారా గొప్ప ఉద్యోగ అవకాశం. అర్హత : 10+2 & డిగ్రీ. 90001 01631. [M-8630]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-776024]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోవడానికి వర్కర్స్, నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం, జీ: 18K ఏజెంట్ కమీషన్ 3K. ఫోన్.9848571888, 7569955551. [H-786819]

■ NRI తల్లిదండ్రులను, వృద్ధులను వారి ఇంటి వద్దనే ఉండి చూసుకొనుటకు, ఆయాలు, కేర్‌టేకర్స్ M/F హెల్పర్లు కావలెను. Salary 14-20K వసతి + భోజనం కలదు. ✆ 91608 35559, 78158 35561 [B-782]

■ Dherji సైట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. PVR Projects Ltd., మహారాష్ట్ర. ఫోన్: 040-23348080, 23338080 Email:adm.vineela@gmail.com [HA-779938]

■ Wanted Operators - (15), Salary-15k, ESI + PF+ Accomidation, Qly: 10+, Ph: 9110783252 [HA-779937]

■ కృష్ణా జిల్లా, జగ్గయ్యపేట మండలంలోని ప్రముఖ సిమెంట్ ఫ్యాక్టరీలో మా సంస్థ అయిన సత్యా ఇన్వెస్టిగేషన్ & సెక్యూరిటీ సర్వీసెస్, గుంటూరు తరుపున పనిచేయుటకు మంచి దేహ దారుఢ్యము కలిగిన సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ అర్హతలు: వయస్సు 30-45 సం।। అర్హత: ఇంటర్/డిగ్రీ, ఎత్తు:05'-06" ఆపైన, రిటైర్డ్ ఆర్మీ, పారా మిలటరీ వారికి ప్రాధాన్యత. సెక్యూరిటీ గార్డ్ అర్హతలు: వయస్సు 30-45 సం।। పదవ తరగతి, ఎత్తు: 05'-06" ఆపైన సంప్ర: 8466996958, 7901389772 [G-522]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.